# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 28, నవంబర్ 2025





# క్రీడాభివృద్ధి ఎలా..?

✷ అధ్వానంగా మారిన మైదానం ✷ మందు బాబులకు అడ్డాగా మైదానం

మంచిర్యాల, నవంబర్ 27, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల మైదానం ఇలా అస్తవ్యస్తంగా ఉండటం పట్ల క్రీడాభివృద్ధి ఎలా, అని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కేంద్రంలోని పట్టణ నడిబొడ్డున గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానం పూర్తిగా నిరక్ష్యానికి గురైందని, ఉదయం నడకకు వచ్చే వందలాది మంది ప్రజలు, నిత్యం యోగా చేసేవారు, బాక్సింగ్, క్రికెట్,ఫుట్బాల్ పలు ఆటలాడే యువకులు విద్యార్థులు, ఆర్మీ, పోలీస్ ఎంపిక కు సాధన చేసేవారు, అథ్లెటిక్స్‌కు ఎంపిక అయ్యేవారు ఈ మైదానాన్ని ఆధారంగా చేసుకుంటారు. కానీ ఇప్పుడు ఆ స్థితి దయనీయంగా తయారైంది. మైదానం మొత్తం చెత్తాచెదరంతో నిండిపోయింది.




2లో..

### గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను

# పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల పరిశీలకులు అయేషా మస్రత్ ఖానం**



నిర్మల్ పట్టణం, ప్రభాతవార్త

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణచందా మండలంలోని వడ్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు, కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను మిగతా 2లో..

# ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

★ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త

జిల్లాలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పాక్షి కంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, ఎఫ్ఎస్టి-ఎస్ఎస్టి బృందాలతో కలెక్టర్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదని అన్నారు. ఎన్నికల ప్రచార పత్రాల్లో ప్రింటింగ్ ప్రెస్ వివరాలు తప్పనిసరిగా ఉండాలని, ప్రెస్ యజమానులకు సూచించారు. ఎఫ్ఎస్టి-ఎస్ఎస్టి బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేసి, ఉల్లంఘనలు గమనించిన వెంటనే నివేదించాలని మిగతా 2లో..



# బ్యాంకర్లు రుణ లక్ష్యసాధనలో పురోగతి సాధించాలి

ఆసిఫాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త :

బ్యాంకర్లు 2025-26 వార్షిక సంవత్సరం ఋణ లక్ష య సాధనలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన వార్షిక సంవత్సరం 2వ త్రైమాసిక సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డిఓ శ్రీనివాస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రితీష్ కుమార్ గుప్తా, నాబార్డ్ డిడిఎం వీరభద్రుడు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు లతో కలిసి హాజరై రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, జన్ ధన్ యోజన, ముద్ర రుణాలు, ఆధార్ అనుసంధానం, బ్యాంకు లింకేజీ, ఎస్సి రుణాలు, ట్రైకార్ రుణాల లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. వ్యవసాయ ఆధారిత యంత్రాలు, సోలార్ ఫెన్సింగ్ అలాంటి వాటిపై రైతులకు రుణాలు అందించి ప్రోత్సహించాలని, గృహ నిర్మాణాల రుణాల పురోగతిని సాధించాలని, స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి రుణ మంజూరు చేసి ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. డిపిఎంలు, ఏపిఎంలు, బ్యాంకు అధికారులను సంప్రదించి రుణ లక్ష్యాలు పూర్తి స్థాయిలో సాధించేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్, మెప్మా పి. డి. మోతీరామ్, సెర్ప్ డి పి ఎం, ఎ పి ఎం, బ్యాంకు మేనేజర్లు, అధికారులు



### ఎన్నికల నిర్వహణకు

# ఏర్పాట్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. ప్రజలు 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకవెళ్తే తప్పనిసరిగా రసీదులు, డాక్యుమెంట్లతోనే ఉండాలని స్పష్టం చేశారు. శాంతియుత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టబోయే గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన భద్రతా బందోబస్తు ఇప్పటికే సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకునేలా పోలీసు విభాగం సన్నద్ధమైందన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ కలిసి ఎఫ్ఎస్టి వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, ఎఫ్ఎస్టి-ఎస్ఎస్టి బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## భాజపా పార్టీలో చేరికలు

### - కండువా కప్పి ఆహ్వానించిన భాజపా జిల్లా అధ్యక్షుడు

**మంచిర్యాల, నవంబర్ 27, ప్రభాతవార్త**

మంచిర్యాల బిజెపి జిల్లా కార్యాలయంలో గురువారం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో చేరారు. తదనంతరం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిజెపిలో చేరిన గద్పూర్ ఉప సర్పంచ్ మాజీ సుంచు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు లింగాల అశోక్, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ మండల అధ్యక్షులు స్వామి రెడ్డి, కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రంగారావు, పార్టీ సీనియర్ నాయకులు బెల్లంకొండ మురళీధర్ మెట్టుపల్లి జయ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ

**లక్షెట్టిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ఎన్నికలకు సంబంధించి ఆశావహుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మండలంలోని దౌడేపల్లి క్లస్టర్ పరిధిలో మూడు గ్రామాలకు సంబంధించిన ఆశావహులు నామినేషన్ కేంద్రానికి వచ్చి సమర్పిస్తున్నారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు వేణుగోపాల్, శరత్, పంచాయతీ కార్యదర్శి సుజాత, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



# మైదానం ఇలా.. క్రీడాభివృద్ధి ఎలా..?

(మొదటిపేజీ తరువాయి)

ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, ఆకులు, ధూళి పేరుకుపోయి శుభ్రత శూన్యం. ఇంకా మందుబాబులు అయితే మద్యం తాగి సీసాలు పగల వట్టి పడేయడం వల్ల ఉదయం తెల్లవారుజామున 5 గంటలకు వాకింగ్ వచ్చే సభ్యులకు పలు సందర్భాల్లో బూట్లు ఉన్నప్పటికీ కాళ్లకు గాయాలైన సందర్భాలు ఉన్నాయని, గేటు ముందర మలమూత్రాలు విసర్జించడంతో మైదానం కు వచ్చేవారు వాసనతో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీరు లేక, తలుపులు లేక నిరుపయోగంగా పడి ఉన్నాయని, వాకింగ్ ట్రాక్ పూర్తిగా లేకపోవడం, గుంతలు, రాళ్లు, కలుపు మొక్కలతో నిండి నడవడం కష్టంగా మారింది. త్రాగు నీటి సౌకర్యం లేదు, ఓపెన్ జిమ్ లేక, మైదానం చుట్టూ మురుగునీటి దొడ్లు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. దోమలు, ఈగల బెడద కొనసాగుతోంది. ఈ మైదానం పాఠశాలకే కాకుండా, జిల్లా కేంద్రంలోని ప్రజలందరికీ ఉమ్మడి ఆస్తి. కానీ దీన్ని పట్టించుకునే ఒక్క అధికారికి కనిపించడం లేదని, ఇలా అయితే క్రీడాభివృద్ధి ఎలా అని పట్టణ వాసులందరూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, మంచిర్యాల కార్పొరేషన్ అధికారులు - ఎవరూ బాధ్యత తీసుకోవడం లేదని, ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఈ మైదానంలో నడక చేసే వృద్ధులు, మహిళలు, యువకులు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ప్రజలు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడాకారులను ప్రోత్సహించాలని చెప్పినప్పటికీని పట్టించుకునే వారే కరువయ్యారు. వెంటనే మైదానాన్ని శుభ్రం చేయాలి, సరైన వాకింగ్ ట్రాక్ వేయాలి, త్రాగే నీటి సౌకర్యం, ఓపెన్ జిమ్ మరమ్మత్తు, ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేసి, మరిన్ని మురుగు దొడ్లు నిర్మించాలని. లేదంటే భారీ నిరసనలు తప్పవని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మైదానంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

### గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను

# పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించారు. మాట్లాడుతూ హెల్ప్ డెస్క్ లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు నిరవధిక పోరాటం చేయాలి

### - బీసీ సమాజం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ పిలుపు

**బెల్లంపల్లి, నవంబర్ 27, ప్రభాతవార్త**

బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు 42 శాతం సాధించేందుకు జిల్లాలోని బీసీలు నిరంతర ఉద్యమాలు చేపట్టేందుకు కధం తొక్కాలని బీసీ సమాజం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ లు పిలుపునిచ్చారు. గురువారం బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏఎంసి నెంబర్ టు క్రీడ మైదానంలో నిర్వహించిన ఛాయ్ పే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు చేపట్టే పోరాటాలకు బీసీ సమాజం ప్రజలు సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. బీసీలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో, ప్రభుత్వ పథకాలలో న్యాయమైన వాటాల సాధనకు బీసీ యువజనులు భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. బీసీలు మేల్కొండి 42 శాతం రిజర్వేషన్ల సాధనకు అని పిలుపునిచ్చారు. షెడ్యూల్ నైన్ లో బిసి హక్కులను ప్రభుత్వాలు చేర్చాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజం నాయకులు డీ. శ్రీధర్ స్వామి, అక్కిరెడ్డి శంకర్, మద్దెర్ల శ్రీనివాస్, గజ్జెల్లి మోహన్, గైని శంకర్, తొంగల రాజేశం, నర్సయ్య, మత్తమారి ఉమా మహేశ్వర్, కొలిపాక శ్రీనివాస్, కొట్టె వినయ్, బండి లక్ష్మణ్, రవి, బొర్ర ప్రసాద్, కస్తూరి సత్తన్న, కొండ బత్తిని రామ్మోహన్, లక్ష్మణ్, కజ్జం రమేష్, పైడాకుల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేత

**తాండూర్, నవంబర్ 27, ప్రభాతవార్త :**

మండల స్థాయి ఎల్టా పోటీల్లో భాగంగా తాండూర్ జెడ్ పి హెచ్ ఎస్ లో గురువారం విద్యార్థులకు ఉపన్యాస, రాత పరీక్షలు నిర్వహించారు. సీనియర్ విభాగం రాత పరీక్షలో తేజస్వి (తాండూర్) ప్రథమ స్థానం, అశ్వర్థ (రేచిని) ద్వితీయ స్థానం, ఉపన్యాస పోటీల్లో తేజస్వి (తాండూర్) ప్రథమ స్థానం, ఫర్హాన్ (తాండూర్) ద్వితీయ స్థానం సాధించారు. జూనియర్ విభాగంలో ఉపన్యాస, రాత పరీక్షలో అమూల్య (రేచిని) ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. అదేవిధంగా కేజీబీవీ విద్యార్థులు కూడా పలు బహుమతులు గెలుచుకున్నారు. ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు హెచ్ఎం శ్రీనివాస్ బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. డిసెంబర్ లో మంచిర్యాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, బట్టారి వెంకటేశ్వర్లు, రవిబాబు సంతోష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్



## ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానంను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

నిర్మల్ పట్టణం, నవంబర్ 27, ప్రభాతవార్త

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు పరిశీలకులుగా నియమించబడి, జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయేషా మస్రత్ ఖానంను, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఉదయం అటవీ శాఖ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్, అబ్జర్వర్ కు పూల మొక్కను అందించారు. అనంతరం ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై ఇరువురు చర్చించారు. పరిశీలకులను కలిసిన వారిలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, నవంబర్ 27, ప్రభాతవార్త

2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025 నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం మొదటి విడత ఎన్నికలలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, ఎం సి ఎం సి, ఎంసిసి, ఇతర ఎన్నికల సంబంధిత పర్యవేక్షణ బృందాలను, ఎన్నికల అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలను ప్రలోభ పెట్టే నగదు, మద్యం, కానుకల పంపిణీ, ప్రచారం, అక్రమ నగదు రవాణా, ఇతర ప్రభావిత అంశాలపై నిఘా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అంశాలు ఎవరి దృష్టిలోకైనా వచ్చినట్లయితే కంట్రోల్ రూమ్ నంబర్ 08736-250501లో ఫిర్యాదు చేయవచ్చని, ఇతర ఎన్నికల సంబంధిత సమాచారం కోసం సంప్రదించవచ్చని తెలిపారు.

## రైతుల ఖాతాలలో వరిధాన్యం నగదు జమ

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య

నస్పూర్, నవంబర్ 27, ప్రభాతవార్త

జిల్లాలో 2025-26 సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యాన్ని విక్రయించిన రైతుల వివరాలు ఆన్‌లైన్ చేసిన వారి ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గురువారం జిల్లాలోని ఇటిక్యాలలో మెప్మా ఆధ్వర్యంలో, గుల్లకోటలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు.



# నామినేషన్ ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట, మిట్టపల్లి, సూరారం గ్రామాలకు గుల్లకోట గ్రామపంచాయతీ, పోతపల్లి, అంకతిపల్లి, లక్ష్మీపూర్ గ్రామాలకు పోతపల్లి గ్రామపంచాయతీ, చందారం, హనుమంతుపల్లి, రంగపేట గ్రామాలకు చందారం గ్రామపంచాయతీలలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు.



జిల్లాలో 3 విడతలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగాఎవరిని అనుమతించకూడదని, నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడివ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామి నేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం ఇటిక్యాల గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన పోస్ట్ మార్టం గది నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధి కారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా స్థాయి ఇన్స్పైర్ బాల వైజ్ఞానిక ప్రదర్శన

దహెగాం, నవంబర్ 27, ప్రభాతవార్త :

దహెగాం మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న రాస్పల్లి పాఠశాల నుండి ఈ నెల 24,25,26 తేదీలలో జిల్లాస్థాయి ఇన్స్పైర్ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ఐదు గురు విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొనడం జరిగింది. మూడు ఇన్స్పైర్ ప్రదర్శనలు జరిగాయి పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని పాలే వాహిని ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక అయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు మహేష్, సుమలత లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.



సాగర్‌కు భీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ విశ్వేశ్వరరావు

## పిఎంజెజెబివై బీమా చెక్కు అందజేత

తాండూర్, నవంబర్ 27, ప్రభాతవార్త :

మండలానికి చెందిన సాగర్ అనే యువకుడికి రూ.2 లక్షల భీమా చెక్కును గురువారం స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విశ్వేశ్వర్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులైన లక్ష్మి ఇటీవల మృతి చెందారు. దీంతో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం ద్వారా లక్ష్మి కుమారుడైన సాగర్ కు రూ.2 లక్షలు భీమ మంజూరు అయ్యాయన్నారు. అర్హులైన ప్రతి ఖాతాదారుడు బీమా చేయించుకోవాలని ఆయన కోరారు. ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఈసీ సభ్యుల ఆధ్వర్యంలో

## మార్కెట్ వ్యాపారుల సభ్యత్వ నమోదు

మందమర్రి, నవంబర్ 27, ప్రభాతవార్త

మందమర్రి మార్కెట్ వ్యాపార కమిటీ అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. మార్కెట్లో వ్యాపారం చేస్తున్న ప్రతి వ్యాపారి తప్పనిసరిగా సభ్యత్వం పొందాలని ఎన్నికల కమిటీ తెలియజేసింది. వ్యాపారుల సమస్యల పరిష్కారం, మార్కెట్ అభివృద్ధి, సమగ్ర వ్యాపార వాతావరణం కోసం సభ్యత్వ నమోదు కీలకమని కమిటీ పేర్కొంది. అందువల్ల మార్కెట్‌లో ఉన్న అన్ని వ్యాపారులు ఈ అవకాశాన్ని డిసెంబర్ 2లోగా వినియోగించుకొని తక్షణమే సభ్యత్వం పొందవలసిందిగా కోరుతున్నారు.



సభ్యత్వ నమోదు చేపడుతున్న ఈసి సభ్యులు

## ఉచితంగా డ్రాయింగ్ బుక్స్ అందజేత

జైపూర్, నవంబర్ 27, ప్రభాతవార్త

చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం కుందారం గ్రామం జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ చిత్రకళ పై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారికి చిత్రకళ పై మక్కువ పెంచే దిశగా తమ అకాడమీ ఆధ్వర్యంలో ఉచితంగా విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్ అందజేసినట్లు తెలిపారు.



# నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా ఎన్నికల పరిశీలకులు అయేషా మస్రత్ ఖానం**

లక్ష్మణచాంద, నవంబర్ 27,

ప్రభాతవార్త:

లక్ష్మణచాంద గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకురాలు ఆయేషా మస్రత్ ఖానం అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీచేసి నామినేషన్ల ప్రక్రియను పరిశీలకులు, కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అయోషా మస్రత్ ఖానం మాట్లాడుతూ హెల్ప్ డెస్క్‌లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకాల ఫారములను తగినన్ని అందుబాటులో ఉండాలని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని, రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని, ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎస్సై శ్రీనివాస్ యాదవ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వడ్యాల్‌లో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల జిల్లా అధికారి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

**- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

తాండూర్, నవంబర్ 27, ప్రభాతవార్త :

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం తాండూర్ మండల పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అమలు కానీ హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దని పార్టీ నాయకులు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుక రాంచందర్, మాసాడి శ్రీరాములు, గట్టు సంతోష్ కూమార్, మాసాడి రామకృష్ణ, మడే హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ బందోబస్తు నడుమ గ్రామపంచాయతీ ఎన్నికల పోరు నామినేషన్ స్వీకరణ ప్రారంభం

లింగాపూర్, నవంబర్ 27, ప్రభాతవార్త :

లింగాపూర్ మండలంలో ప్రారంభమైన సర్పంచ్ నామినేషన్ ప్రక్రియ మూడు క్లస్టలలో నామినేషన్ ల స్వికారకు ఏర్పాట్లు చేసిన అధికారులు,1 లింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పిట్టగూడ, లింగాపూర్, మామిడిపల్లి, పిక్లతండా,2 జాముల్ దారా గ్రామపంచాయతీ క్లస్టర్లో ఎల్లాపాటర్. కీమానాయక్ తండా, లోదిగూడ, చిన్నదాంపూర్, జముల్ ధర,3,కాంచనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం క్లస్టర్ లో ఘుమునూర్, చొర్పల్లి,కాంచనపల్లి,కొత్తపల్లి, మోతీ పటార్, లలో నామినేషన్ కేంద్రాలు ఏర్పాట్లు చేసి అధికారులు నామినేషన్ స్వీకరిస్తున్నారు.నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల దూరం నుండి సర్కిల్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లింగాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగన్న ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తూ ఏర్పాటు చేయడం జరిగింది.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్ఈ జాడే ఉత్తమ్

## విద్యుత్ శాఖ ఎస్ఈ గా జాడే ఉత్తమ్ బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త :

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్పిడీసీఎల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ గా జాడే ఉత్తమ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. గతంలో ఈయన మంచిర్యాల జిల్లాలో ఎస్ఈ గా విధులు నిర్వర్తించారు. బదిలీలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన శేషారావు ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ పై వెళ్లడంతో ఇక్కడ ఉన్న ఖాళీని ఆయనతో భర్తీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఈ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందజేస్తామని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావుకు ఘన స్వాగతం

మంచిర్యాల, నవంబర్ 27, ప్రభాతవార్త

మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చాలా రోజుల తర్వాత శస్త్రచికిత్స అనంతరం తిరిగి ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టినందుకు వారికి నాయకులు కార్యకర్తలు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. గురువారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్ కలెక్టర్ ఆఫీస్ వద్దకు చేరుకోగా, వారు నిండు నూరేళ్లు ఆయుష్షు ఆరోగ్యాలతో ఉండి నియోజకవర్గంలోని ప్రజాక్షేత్రంలో ప్రతి ఒక్కరికి సేవలందించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. జై పిఎస్ఆర్, జైజై పిఎస్ఆర్, పిఎస్ఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ జేజేలు కొడుతూ ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భారీ ర్యాలీ తీస్తున్న అభిమానులు



## విద్యార్థులను అభినందించిన సింగరేణి జనరల్ మేనేజర్

బెల్లంపల్లి, నవంబర్ 27, ప్రభాతవార్త

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన సింగరేణి పాఠశాల విద్యార్థులను జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డి గురువారం జిఎం కార్యాలయంలో అభినందించారు. సింగరేణి పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న డి. శివకుమార్ ఆసిఫాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని తన ప్రయోగ ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిఎం విజయభాస్కర్ రెడ్డి ప్రదర్శనలో పాల్గొన్నవారికి ధ్రువ పత్రాలు అందించి అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, డీజీఎం (సివిల్) ఎస్కే మదీనా బాషా, కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్, ప్రధానోపాధ్యయుడు రవితేజ, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## రక్షణలో బెల్లంపల్లి ఏరియాను ప్రథమ స్థానంలో నిలపాలి

బెల్లంపల్లి, నవంబర్ 27, ప్రభాతవార్త

బెల్లంపల్లి ఏరియాలో ఉద్యోగులు రక్షణతో కూడిన విధులు నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు, అవగాహన కల్పించాలని జీఎం ఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో నిర్వహించిన 56 వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో ఉద్యోగుల రక్షణకు సింగరేణి పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ప్రతి ఉద్యోగికి సేఫ్టీ మేనేజ్ మెంట్ ప్లాన్ పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగులు ఇంటినుంచే రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ నుండి ప్రారంభం కానున్న 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల నిర్వహణ కోసం ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. కళాకారుల పాటలు, నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యతను వివరిచాలని పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాకు మొదటి బహుమతి వచ్చేల ప్రతి ఉద్యోగి కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరిగుర పిఓ మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, డీజీఎం (సివిల్) ఎస్కే మదీనా బాషా, సిహెచ్‌పి ఇంచార్జి కోటయ్య, వర్క్ షాప్ హెచ్ఓడి జ్ఞానేశ్వర్, ఖైరిగుర మేనేజర్ జె. శంకర్, ఏంవిటిసి మేనేజర్ మధుసుదన్, పర్సనల్ హెచ్ఓడి ఎం శ్రీనివాస్, ఖైరిగుర సేఫ్టీ అధికారి గౌతమ్ రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెబ్బెనలో పోలీసుల తనిఖీలు

తాండూర్, నవంబర్ 26, ప్రభాతవార్త :

రెబ్బెన మండల కేంద్రంలోని బస్టాండ్ లో గురువారం రాత్రి ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర, తదితర వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తనిఖీలు చేపట్టమన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనాలను ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్సై సూచించారు.




మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

**ఆసిఫాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త**

తెలంగాణ మోడల్ స్కూల్ ఆసిఫాబాద్‌లో ఈరోజు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ,సూర్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా బాలల సంరక్షణ అధికారి (డిసిపిఓ) బూర్ల మహేష్ హాజరై మాట్లాడుతూ బాల్యం అమూల్యం. బాల్యవివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయి. చదువు మధ్యలో ఆగిపోవడం, జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది,” అని పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వం బాలికల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. 2030 నాటికి బాల్యవివాహాలు లేని భారతదేశం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పిల్లలు అంకితభావం, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఎంసి శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయులు శ్రీ వర్ధన్, సూర్ సంస్థ కోఆర్డినేటర్ సంతోష్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్, దేవాజీ, జెండర్ స్పెషలిస్ట్ రాణి, సాగర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల్లో భద్రత వ్యవస్థల పరిశీలన

**పెంచికల్ పేట్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎంపిడిఓ ఆల్బర్ట్, తహసీల్దార్ తిరుపతి, ఎస్సై అనిల్ కుమార్ సంయుక్తంగా మండలంలో నామినేషన్ ప్రక్రియ కొనసాగనున్న కమ్మర్గాం, లోడ్పల్లి, చెడ్వాయి, ఎల్కపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్, పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో ఏర్పాట్లు, భద్రత, సిబ్బంది విధులు, సిసి కెమెరా అమరికలు, ర్యాంపులు, త్రాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ పోలింగ్ కేంద్రాలకు ఇతర వ్యక్తులు 100 మీటర్ల దూరంలో ఉండాలని శాంతి భద్రతల పట్ల చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

## ఉచిత దంత వైద్య శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్, నవంబర్ 27, ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్) సేవా కార్యక్రమాల్లో భాగంగా స్పర్ష సోషల్ ఫౌండేషన్ సహకారంతో కాగజ్‌నగర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జీడీచేనులో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీఎస్ డెంతల్ సర్జన్ డాక్టర్ కీర్తి 61 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి దంతాల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవసరమైన మందులను అందజేశారు. అనంతరం దంతాల రక్షణకు సంబంధించిన వివిధ రకాల వస్తువులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీయం సీఎస్ఆర్ మేనేజర్ రేవతి మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు, విద్యార్థులకు తమ వంతుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వివిధ రకాల సేవలు అందించేందుకు కృషిచేస్తున్నామని ఇందులో భాగంగా అన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. బాలకృష్ణ,సిఎస్ఆర్ సభ్యులు సుశీల, ఓహెచ్‌సి సిస్టర్ శ్రీవాణి, పేపర్ మిల్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




వైద్య శిబిరంలో పాల్గొన్న ఎస్పీయం సీఎస్ఆర్ మేనేజర్ రేవతి,తదితరులు

# ఎన్నికల నేపథ్యంలో మీడియా సెంటర్ ప్రారంభం

**ఆసిఫాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మీడియా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ లో మీడియా సెంటర్ ను గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు వి. శ్రీనివాస్, వ్యయ పరిశీలకులు బి.స్వప్న, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. తొలి విడతలో 5 మండలాలలోని 27 కేంద్రాలలో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2874 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 353895 మంది ఓటర్లు ఉన్నారని, మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీల ద్వారా పత్రికలలో, టి. వి. లలో వచ్చే చెల్లింపు వార్తలు, వార్త కథనాలు, ప్రకటనలపై, సోషల్ మీడియా ప్రచారంపై నిఘా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థలలో సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నం.8500844365 లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సంబంధాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే




## గ్రామాలలో ఎన్నికల గంట మోగే

**సారంగాపూర్, నవంబర్27, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం నుండి ప్రారంభమైనది. గ్రామాలలో రాజకీయ వేడి ప్రారంభమైనది. అధికారులకు ఎన్నికల కోడ్ రావడంతో అధికార పోస్టర్లను తొలగించి వాటిపై పెయింట్ వేశారు. స్థానిక నాయకులు రిజర్వేషన్లు ఉండడం ద్వారా తమకు అనుకూల వ్యక్తిని గెలిపించుకోవాలని ఇరుపార్టీల వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పచ్చని పల్లెలలో రాజకీయ రణరంగం మొదలైనది. మొదటి విడత ఖానాపూర్, పెంబి, కడం, దస్తురాబాద్, మామడ, లక్ష్మణ్‌చందా, రెండవ విడత నిర్మల్, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), లోకేశ్వరం, కుంటాల, మూడవ విడత బైంసా, కుబీర్, తానూర్, ముధోల్ బాసర మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

## మొదటి రోజు 15 నామపత్రాలు

**ఆసిఫాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

కుమురం భీం జిల్లాలో తొలివిడత పంచాయతీఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. తొలివిడతలో మొదటి రోజు జిల్లాలోని 5 మండలాల్లో 114 గ్రామపంచాయతీలకు గాను 15 మంది మాత్రమే నామపత్రాలు దాఖలు చేశారు. జైనూర్ 2, లింగాపూర్ 7, కేరమెరి 2,సిర్పూర్ యూ 0, వాంకిడి 4 నామపత్రాలు అందజేశారు. ఎన్నికల్లో భాగంగా తొలి విడతలో ఈ నెల 29 వరకు అభ్యర్థులు నామాపత్రాలు అందజేయవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు.

## అనారోగ్య సమస్యలతో యువకుడు ఆత్మహత్య

**సారంగాపూర్, నవంబర్ 27, ప్రభాతవార్త:**



అనారోగ్య సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మహబూబ్ ఘాట్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా నేరడికొండ గ్రామానికి చెందిన అల్వే చరణ్(25) సారంగాపూర్ మండలం మహబూబ్ ఘాట్ లొద్ది దర్గా దగ్గరలో చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు. మృతుడు గత కొన్ని రోజుల నుండి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని, పెళ్లి సంబంధాలు కూడా కుదరడం లేదని, నిన్న మధ్యాహ్నం నిర్మల్ వెళ్లి వస్తానని ఇంట్లో నుండి బయలుదేరని తెలిపారు. అతని అన్న సాయికుమార్ ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు.

## గోండుగూడ గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

### - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, నవంబర్ 27, ప్రభాతవార్త:**

గోండుగూడ గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నెరడిగొండ మండలం ఇజ్జార్ గ్రామ పంచాయతీలోని మారుమూల గ్రామమైన గోండుగూడను గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఘనంగా స్వాగతం పలికి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గూడలకు రాజ్యం కల్పించిన ఘనత కేసీఆర్‌దని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు రవీందర్ రెడ్డి, రమేష్, అనిల్ యాదవ్, భారత్, రవీందర్, గంగాసింగ్, నజీర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

## చిన్న వయసులో చనిపోవడం బాధకారం

**ఆదిలాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన ఆల్వే సాయి తమ్ముడు ఆల్వే చరణ్ (25) మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ వారి ఇంటికెళ్ళి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇంత చిన్న వయసులో చనిపోవడం బాధకారం అన్నారు. ఆయన వెంట నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, షేక్ వకీల్, యండి సద్దాం, మోలానా తాజాముల్, మనోజ్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వం స్పందించి డిఏలు వెంటనే చెల్లించాలి

**పెంచికల్ పేట్, నవంబర్ 27, ప్రభాతవార్త :**

పెండింగ్లో ఉన్న ఐదు డిఏలను తక్షణమే విడుదల చేయడంతో పాటు పిఆర్సిని వెంటనే ప్రకటించాలని టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కొయ్యడ సాయి కుమార్ అన్నారు గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ డిఏ అనేది ఎప్పటికప్పుడు చెల్లించాల్సిన ప్రభుత్వ భాద్యత అని నెలకు 700కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ ఇంకా బిల్లు పెండింగ్ లో ఉండటం విచారకరమన్నారు. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ నిమిత్తం ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు ఇవ్వదల్చుకున్న అంశాన్ని ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కిషోర్, కోశాధికారి మల్లన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు సాయి కుమాం


నామినేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పి రాజేష్ మీనా

## నామినేషన్ సెంటర్‌ను పరిశీలించిన ఏఎస్పి

**లక్ష్మణచందా, నవంబర్ 27, ప్రభాతవార్త:**

మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ సెంటర్‌ను గురువారం ఏఎస్పీ రాజేష్ మీనా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్లు ప్రశాంతంగా జరగాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సోన్ సిఐ గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మణచాంద ఎస్సై శ్రీనివాస్ యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు నామినేషన్లు దాఖలు

**ఉట్నూర్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

పంచాయతి ఎన్నికలో భాగంగా ఉట్నూర్ సర్పంచ్‌గా పోటీ చేయడానికి మొదటి రోజు గురువారం ముగ్గురు నామినేషన్ వేశారు. మేజర్ గ్రామపంచాయతిలో 18 వార్డులు ఉండగా సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ మహిళకు కేటాయించారు. అందులో మాజీ జడ్పీటీసీ రాథోడ్ చారులత, కొమ్ముగూడకి చెందిన బానోత్ సంగీత, సేవాదాస్‌నగర్‌కి చెందిన సుమన్ బాయి నామినేషన్‌లు వేశారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకులు

**ఆదిలాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

జిల్లాలో జరుగనున్న పంచాయితీ ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు టి. వెంకన్న, వ్యయ పరిశీలకులు ఎల్. విజయ గురువారం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని జిల్లా కలెక్టర్ రాజర్షి షాను పూల మొక్కను అందజేసి, మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది శిక్షణ, ఓటర్ల సౌకర్యాలు, నిబంధనల అమలు, వెబ్‌కాస్టింగ్, వ్యయ పరిమితులపై పరిశీలకులు కలెక్టర్‌తో చర్చించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను వారు సమీక్షి ంచి, అవసరమైన సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా పంచాయతి అధికారి రమేష్, డివైఎస్ఓ శ్రీనివాస్, డిఎల్పీవో ఫణిందర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావి వైద్యుడికి సన్మానం

**అదిలాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

అదిలాబాద్ జిల్లాలో గ్రామ గ్రామానికి వెళ్లి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్న డాక్టర్ ఆడే క్రాంతి కుమార్ సేవలను గుర్తిస్తూ, లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ ప్రత్యేకంగా సన్మానించారు. డాక్టర్ క్రాంతి కుమార్ నిర్వహిస్తున్న సేవల్లో ప్రతీ గురువారం శ్రీకృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో గర్భిణీ మహిళలకు ఉచిత రక్తపరీక్షలు, స్వగ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, తమ ఊరికి బస్టాండ్ నిర్మాణం వంటి ప్రజా కార్యక్రమాలు ముఖ్యంగా నిలిచాయి. సన్మానం సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ సమాజం ఎదగాలంటే వైద్య సేవల్లో ఇలాంటి సేవా ధర్మం ఎంతో అవసరమని డాక్టర్ క్రాంతి కుమార్ సేవలు అనేక మందికి ఆదర్శమని అన్నారు. అనంతరం డాక్టర్ ఆడే క్రాంతి కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సేవలు చేరాలనే లక్ష ్యంతో పని చేస్తున్నామని, ప్రజలే నా బలమని తెలిపారు. ఈ సన్మానం కార్యక్రమం స్థానికంగా సందడి నెలకొల్పగా, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


డాక్టర్ ఆడే క్రాంతి కుమార్‌కు సన్మానిస్తున్న డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

## దీక్ష దివాస్ సన్నాహక సమావేశం

### పాల్గొన్న మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు

**మంచిర్యాల, నవంబర్ 27, ప్రభాతవార్త**

స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినం నవంబర్ 29న చేపట్టే దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలతో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం పాల్గొన్న మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు.అనంతరం వారు మాట్లాడుతూ నవంబర్ 29వ తేదీన దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించవలసిన విధివిధానాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి దీక్ష దివస్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, చెన్నూర్ మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్, బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య ,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి మూడు నియోజకవర్గాల బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డి.ఎల్.పి.ఓ.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డి.ఎల్.పి.ఓ.

**తాండూర్, నవంబర్ 27, ప్రభాతవార్త**

మండలంలోని అచ్చలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను గురువారం బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో డిసెంబర్ 14న జరగనున్న సర్పంచ్, వార్డు స్థానాల పోలింగ్ ను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఎంపీడీవో శ్రీనివాస్ ను డిఎల్పిఓ అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీఓ అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త :**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఇటీవల నల్గొండ జిల్లా చౌటుప్పల్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో బంగారు పతకం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీలలో, రాష్ట్రస్థాయి పోటీలలో బంగారు పతకం, బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన నలుగురు విద్యార్థినులు రజత పతకం సాధించిన జిల్లా జట్టు కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులు గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించి జిల్లా పేరును నిలబెట్టాలని తెలిపారు. క్రీడలలో అత్యున్నత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులకు తర్ఫీదు అందించిన కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మడావి శేషు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పుర్క ఉద్ధవ్, కోచ్ లు తిరుమల, విద్యాసాగర్, అరవింద్, పి. డి.లు మీనా రెడ్డి, గుండం లక్ష్మణ్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.


ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్

## నూతన డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

**ఉట్నూర్, నవంబర్ 27, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన వెడ్మ బొజ్జు పటేల్‌ను గురువారం శాలువాతో సన్మానించారు. మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మెస్రం వసంత కుమారి, కేశవ్‌రావ్, అభిమానులు, సామాజిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వసంతకుమారి, కేశవరావు మెస్రం

# విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు

**లక్షెట్టిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డిసిపి పర్యవేక్షణలో మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇన్చార్జి ఎస్ఐ హైమ ఆధ్వర్యంలో బాల్య వివాహం ఒక చట్టవిరుద్ధమైన, సమాజానికి హానికరమైన చర్య అని, చిన్న వయసులో పిల్లల మధ్య వివాహాలు జరగడం వల్ల వారి ఆరోగ్యం, విద్య, ఆర్థిక, సామాజిక భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయి అని ఈ బాల్ వివాహ ముక్తి భారత్ కాంపెయిన్ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దౌడేపల్లి లక్షట్టిపేట మండలంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో షీ టీమ్ సిబ్బంది విద్యార్థులకు బాల్య వివాహంపై, మహిళల భద్రతపై అవగాహన కల్పించబడింది.. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుల్ సతీష్ మాట్లాడుతూ... బాల్య వివాహం వల్లే కలిగే అనర్థాలు, చట్ట సమ్మతమైన వివాహ వయస్సు, బాల్య వివాహ నివారణకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, సహాయ సదుపాయాలు గురించి వివరించారు. విద్యార్థులకు బాల్య వివాహ నివారణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లు (100, 112, 1098) అని తెలిపారు.. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా పిల్లలలో చట్ట పరిజ్ఞానం,



సమాజంలో సక్రమ వైవాహిక ప్రథమమే ముఖ్యమని గ్రహింపజేసే లక్ష్యంతో జరుగుతోంది. విద్యార్థులు తమ చుట్టూ స్పందనీయత చూపించి, బాల్య వివాహాలను నివారించడం కోసం ముందుకు రావాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో బాల్య వివాహ నిరోధానికి మేలైన అవగాహన పాఠంలా నిలుస్తాయి అని తెలిపారు. అంతేగాక బాల వివాహ ముక్తి భారత్ కాంపెయిన్‌లో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. షీ టీమ్ సేవలు, వాటి ఉద్దేశాన్ని గురించి వివరిస్తూ, విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా ఎప్పుడూ అందుబాటులో ఉండే రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షి టీమ్ నంబర్ 8712659385 అని ఈ నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేధింపులు, సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి వాటితో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆన్లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది కానిస్టేబుల్ సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, టీచర్లు సుభాష్, సునీత, 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## సోమిని విద్యార్థి రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ మేళాకు ఎంపిక

**బెజ్జూర్, నవంబర్ 27, ప్రభాతవార్త :**

బెజ్జూర్ మండలంలోని సోమిని బాలుర గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ మేళాకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు పంద్రం బిక్షమయ్య తెలిపారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో సెయింట్ మేరీ పాఠశాలలో ఈనెల 24వ తేదీ నుండి మూడు రోజులు నిర్వహిహించిన జిల్లాస్థాయి బాలల విజ్ఞాన ఇన్స్పైర్ మేళాలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా నుంచి 12 ప్రదర్శనలు పాల్గొనగా అందులో సోమిని 10వ తరగతి విద్యార్థి కార్తీక్ రాష్ట్రస్తాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.





## పోటీ పరీక్షలలో విద్యార్థుల ప్రతిభ

**సారంగాపూర్, నవంబర్27, ప్రభాతవార్త:**

కుబీర్ మండల కేంద్రంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పార్డి(బి) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎడ్యుకేషన్ కాస్ట్ సీనియర్ విభాగంలో 9వ తరగతి విద్యార్థి గుంటోల్ల సంతోష్ కుమార్ మొదటి స్థానం, తెలంగాణ ఇంగ్లీష్ ఓలం పైడ్ జూనియర్ విభాగంలో 7వ తరగతి చదువుతున్న కండికే శృతి 2వ స్థానం, ఎడ్యుకేషన్ కాస్ట్ జూనియర్ విభాగంలో ఏడవ తరగతి చదువుతున్న బెల్లాల అవంతిక రెండవ స్థానం సాధించారు. మండలంలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, విద్యార్థులను ప్రోత్సహించిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు జి రాజేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నకిరెడ్డి నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యుతాఘాతంతో యువనేత మృతి

**నార్నూర్, నవంబర్ 27, ప్రభాతవార్త:**



విద్యుత్ షాక్‌తో యువ నేతి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభునయులు తెలిపిన వివరాల ప్రకారం నార్నూర్ మండలంలోని మహాదాపూర్ గ్రామంలో కాంబ్లె హన్మంత్ రావ్ గురువారం ఉదయం ఐరన్ చేస్తున్న సమయం షాక్ వచ్చి అక్కడికి అక్కడే ఇంట్లో మృతి చెందినట్లు తెలిపారు. కాంబ్లె హన్మంత్‌రావ్ బిఆర్ఎస్‌లో ఎంతో చురుకుగా ఉంటూ పార్టీ బలోపేతం కోసం పనే చేసే వారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటన స్థలం నార్నూర్ పోలీస్ అధికారులు చేరి మృతదేహాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.



## కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### - గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ

**ఎస్‌కె బాజీ సైదా**

**నస్పూర్, నవంబర్ 27, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 5 గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కె బాజీ సైదా అన్నారు. బుధవారం గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు ఆర్.కె 5 గనిని సందర్శించి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ మాట్లాడుతూ ఆర్.కె 5 గనిలో పంప్ ఆపరేటర్, లైన్‌మెన్, ఎస్‌డిఎల్ ఆపరేటర్, కోల్ కట్టర్‌ల రెస్ట్ హాల్‌లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పైకప్పులు మార్చాలని, త్రాగు నీటిని ఏర్పాటు చేయాలని, నాణ్యమైన హ్యాండ్ గ్లౌజులు, చలి కోట్లు ఇవ్వాలని, కోల్ కట్టర్‌లకు ఇన్సెంటివ్ వచ్చేలా చూడాలని, ఎస్‌డిఎల్ యాక్టింగ్ కార్మికులకు ఎస్‌డిఎల్ ఆపరేటర్ ప్రమోషన్ ఇప్పించాలని తదితర సమస్యలను గని మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగ రావు, మేడగోని మల్లేశం, కొట్టే శ్రీకాంత్, భోగ మధునయ్య, గోదారి మురళి, కుక్క శ్రీనివాస్, మహేందర్, నాగుల రాజయ్య, సంపత్, మురళి, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయం నుంచి బయటపడిన మూడేళ్ల రిత్విక

### - పదిరోజుల తర్వాత క్రమంగా కోలుకున్న రిత్విక

**మంచిర్యాల, నవంబర్ 27, ప్రభాతవార్త**

చెన్నూరు మండలం వద్దు సోమనపల్లి గ్రామానికి చెందిన మూడేళ్ల రిత్విక నాలుగు రోజుల జ్వరం అనంతరం అకస్మాత్తుగా స్పృహ కోల్పోయింది. వెంటనే చెన్నూరులోని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా, పాప హార్ట్‌బీట్, పల్స్ తీవ్రంగా తగ్గడంతో మంచిర్యాలకు తరలించాలని వైద్యులు సూచించారు. తల్లిదండ్రుల వివరాల ప్రకారం, మంచిర్యాలలోని కొన్ని ఆసుపత్రులు పాప పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో చేరదలచలేదని తెలిపారు. అనంతరం పరిచయస్తుల సూచన మేరకు రిత్వికను మంచిర్యాల మాత పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రీశైలం పాపను పరిశీలించి పరిస్థితి అత్యంత గంభీరంగా ఉందని, రిస్క్‌కు అంగీకరించిన పక్షంలోనే అడ్మిట్ చేస్తామని చెప్పారు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో నవంబర్ 12న రిత్వికను చేర్పించారు. వైద్యుల ప్రకారం, పాపకు వరుసగా 22 సార్లు ఫిట్స్ రావడమే కాకుండా పల్స్ ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో రెండు రోజులు వెంటిలేటర్‌పై, ఆరు రోజులు ఆక్సిజన్ సపోర్ట్‌పై ఉంచి చికిత్స అందించారు. దాదాపు పది రోజుల పాటు కోమాలో ఉన్న రిత్విక క్రమంగా కోలుకుంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఆసుపత్రి నిర్వహణ ఒక లక్ష రూపాయల వరకు చికిత్స ఖర్చును మినహాయించడం తల్లిదండ్రులను మరింత భావోద్వేగానికి గురి చేసింది. ఈరోజు నవంబర్ 26 పరిస్థితి పూర్తిగా స్థిరపడడంతో డాక్టర్ శ్రీశైలం చిన్నారిని డిస్చార్జ్ చేశారు. తమ కుమార్తె ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆర్థికభారం తగ్గించినందుకు వైద్యులకు, ఆసుపత్రి సిబ్బందికి కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

